క్లుప్తంగా

కష్టపడి చదివితేనే భవిష్యత్



మాట్లాడుతున్న ఎస్సై ప్రవీణ్ కుమార్

బోథ్: కష్టపడి చదివితేనే భవిష్యత్ ఉంటుదని ఎస్సై ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం సోల్జర్ గ్రూప్, మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అగ్నివీర్ మాక్ టెస్ట్ నిర్వహించారు. దాదాపు 200 మంది మాక్‌టెస్ట్‌కు హాజరయ్యారు. ఎస్సై ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. తాను జీవితంలో ఎన్నో కష్టాలు పడి ఉద్యోగం సాధించినట్లు పేర్కొన్నారు. కష్టపడి చదవి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో సోల్జర్ గ్రూప్ ఫౌండర్ కృష్ణ, పోటీపరీక్షల నిపుణులు గొడిసెల రమణ గౌడ్, అల్లం సాయికృష్ణ, మాసం అనిల్ కుమార్, కుషాల్ రెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఐ సాయినాథ్

జైనథ్: సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని సీఐ సాయినాథ్ అన్నారు. మండలంలోని పిప్పల్‌గావ్, అడ గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ప్రతీ నెల మండలంలోని నాలుగు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఏఎస్సై స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో మొహర్రం సందడి



సవారీబంగ్లాలో కొలువుదీరిన పీరీలు

తాంసి: మండలంలోని ఆయా గ్రామాల్లో మొహర్రం సందడి మొదలైంది. పలు గ్రామాల్లోని సవారీ బంగ్లాలో పీరీలు కొలువుదీరాయి. మండల కేంద్రంతో పాటు తాంసి, కప్పర్ల, పాలోడి, సావర్గాం, తాంసి, హస్నాపూర్, బండల్‌నాగాపూర్ గ్రామాల్లో సవారీ బంగ్లాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. వారం రోజుల పాటు మొహర్రం ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా అకాడి పూజలు



పూజలు చేస్తున్న గ్రామస్తులు

సిరికొండ: మండలంలోని కోసుపటేల్ గూడ, సుంకిడి గ్రామంలో అకాడి పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. పాడి పశువులు ఆరోగ్యంగా ఉండాలని, ఎలాంటి వ్యాధులు రాకుండా రక్షణగా ఉండాలని పూజలు చేశారు. అడవిలోకి వెళ్లి రాజుల్ పెన్‌కు దూప, దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపటేళ్లు, దేవారిలు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు



బోనాలతో రజక సంఘం సభ్యులు

బోథ్: మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు, మహిళలు బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి, బోనాలు సమర్పించారు. అనంతరం మేకలను బలిచ్చారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని వేడుకున్నారు.

గ్రామ దేవతలకు పూజలు



ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

తాంసి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి పొచ్చమ్మకు పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలు సుభిక్షంగా పండాలని గ్రామదేవతలను వేడుకున్నారు. గ్రామపెద్దలు పొచ్చన్న, రామన్న యాదవ్, రవీందర్, శరత్, మహిళలు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతిలో పత్తి సాగు



అడేగామ(కె)లో బెడ్ పద్ధతిలో సాగవుతున్న పత్తి

- బెడ్ పద్ధతిపై రైతుల ఆసక్తి
- తగ్గనున్న పెట్టుబడి ఖర్చులు

ఇచ్చోడ: ప్రతీ ఏటా అతివృష్టి కారణంగా రైతులకు ఆశించిన దిగుబడులు రాక తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులు ఎలాగైనా నష్టాల నుంచి బయట పడేందుకు పత్తిసాగులో ఆధునిక పద్ధతులకు శ్రీకారం చుట్టారు. బెడ్ పద్ధతి ద్వారా ఈ ఏడాది నియోజకవర్గంలో అధికంగా పత్తి సాగు చేస్తున్నారు.

సాగు విధానం ఇలా..

పత్తి విత్తుకునే ముందుగా మూడు నుంచి నాలుగు ఫీట్ల వెడల్పుతో బెడ్‌ను తయారు చేస్తారు. రెండు బెడ్‌లు దాదాపుగా ఫీట్ ఎత్తుతో చేయడంతో వాటి రెండింటి మధ్యలో చిన్న కాలువ ఏర్పడుతుంది. ఈ బెడ్‌పై అడుగు దూరంలో పత్తి విత్తనాలు విత్తుకుంటారు. అధికంగా వర్షం కురిసినా.. నీరు పంట పొలంలో నుంచి బయటకు వెళ్లి పోతుంది. బెడ్‌పై ఉన్న పత్తి కర్రకు ఎలాంటి హాని ఉండదు. పంటలో గడ్డి పెరిగే అవకాశం ఉండదు. ఇలాంటి పద్ధతిలో పత్తి విత్తుకోవడం ద్వారా గాలి వీచి, కాత పూత రాలిపోకుండా ఉంటుంది.

పది ఎకరాల్లో సాగు



ఈ ఏడాది బెడ్ పద్ధతి ద్వారా 10 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నా. గతేడాది మంచి దిగుబడులు రావడంతో ఈ ఏడాది బెడ్ పద్ధతిలో సాగు చేస్తున్నా. పెట్టుబడి ఖర్చులు కూడా కొంత మేర తగ్గాయి.

– వెంకటరెడ్డి, అడేగామ(కె) రైతు

ఖర్చులు తగ్గించొచ్చు



బెడ్ పద్ధతిలో పత్తి సాగు చేయడం ద్వారా చాలా ఖర్చులు తగ్గుతాయి. పత్తిలో కలుపు తీయడం, నాలుగైదు సార్లు డౌర కొట్టడం అవసరం ఉండదు. గడ్డి మందు పిచికారి చేయడం ద్వారా గడ్డిని నివారించవచ్చు. దీంతో భారీగా ఖర్చులు తగ్గుతాయి.

– రాథోడ్ రాందాస్, దేవుల్‌నాయక్‌తండా

ఆసక్తి చూపుతున్నారు



ఈ ఏడాది ఎక్కువగా బెడ్ పద్ధతిలో పత్తి సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఈ పద్ధతి సాగు మంచిది. సాగు ద్వారా పంటలో నీరు నిల్వ కుండా ఉంటుంది. పంట ఏపుగా పెరిగి దిగుబడి వస్తుంది.

– భగత్ రమేశ్‌కుమార్, వ్యవసాయాధికారి

కలగానే టూరిజం



కనువిందు చేస్తున్న మత్తడి చెరువు

- మత్తడి చెరువుపై దృష్టి సారించని అధికారులు
- పర్యాటకంగా అభివృద్ధి చేయాలంటున్న గిరిజనులు

ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీలో పేరుగాంచిన మత్తడి చెరువు పర్యాటకుల మదిని దోచుకుంటున్నా.. పర్యాటకంగా ఎలాంటి అభివృద్ధి చెందడం లేదు. ప్రతీఏటా పర్యాటకులు పెద్ద ఎత్తున వస్తున్నప్పటికీ సౌకర్యాలు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఏజెన్సీ డివిజన్ కేంద్రం లక్కారం పరిధిలో వచ్చే ఈ అందాల చెరువు అందరి మదిని దోచుకుంటున్నా.. నిర్లక్ష్యం నీడలో కొట్టుమిట్టాడుతోంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో చెరువు అందాలు కనువిందు చేస్తున్నాయి. లక్కారం నుంచి 3 కిలో మీటర్లు వెళ్తే ఈ అందాలను వీక్షించవచ్చు. అయితే గతంలో అధికారులు సందర్శించినా.. ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు.

కనీస సౌకర్యాలు కరువు..

మత్తడి చెరువు అందాలను వీక్షించేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. అయితే ఇక్కడ కనీస సౌకర్యాలు కరువయ్యాయి. బురదతో నిండిన రోడ్డుపై ప్రయాణించి ఇక్కడికి రావాల్సి ఉంటుంది. చెరువు వద్దకు రావాలంటే బురదతో నిండిన మట్టి రోడ్డు ద్వారానే రావల్సి ఉంటుంది. గతంలో కలెక్టర్ వెంకటేశ్వర్లు, టూరిజం అధికారులు ఈ ప్రాంతంలో పర్యటించారు. పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చినా.. నేటికి ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్ట లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి చేయాలి



మత్తడి చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. గతంలో కలెక్టర్ వెంకటేశ్వర్లు మత్తడి చెరువును టూరిజం కేంద్రంగా ఏర్పాటు చేస్తామన్నారు. అదే విధంగా టూరిజం అధికారులు సైతం ఇక్కడ సందర్శించి నివేదికలు తయారు చేశారు. అయినా నేటి వరకు ఎలాంటి అభివృద్ధి చేయలేదు.

– పుర్క బాపురావు, ఆదివాసీ నాయకుడు

గిరిజనులకు లబ్ధి



మత్తడి చెరువును టూరిజంగా అభివృద్ధి చేస్తే గిరిజనులకు ఉపాధి దొరుకుతుంది. డివిజన్ కేంద్రంలో కాలక్షేపం కోసం ఇలాంటి ప్రదేశాలు ఎక్కడ లేక పోవడంతో ప్రజలు ఎక్కువగా ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడి వాతావరణం, ప్రదేశాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. పర్యాటకులు వచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– మర్సుకోల తిరుపతి, మాజీ సర్పంచ్, లక్కారం

'అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదు'

ఉట్నూర్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఉట్నూర్ పర్యటనలో భాగంగా ఆదివాసీ పెద్దలతో మాట్లాడి జీవో 49పై స్పష్టంగా వివరణ ఇచ్చారన్నారు. జీవోను తప్పు పడుతూ బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. పోడు భూముల సాగులో, అభివృద్ధి పనులు, ఇతర పనుల నిర్మాణం వల్ల ఫారెస్ట్ ఆఫీసర్లు అతి ఉత్సాహం ప్రదర్శించడంతో రాష్ట్రంలో ఎక్కువగా ఇబ్బంది పడేది నేనేనని గుర్తు చేశారు. అదే విధంగా మంత్రి సీతక్కపై కావాలని కొన్ని మీడియా సంస్థలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లింగంపల్లి చంద్రయ్య, రాహుల్, ఎక్బాల్, జగదీష్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ విగ్రహావిష్కరణ



నివాళులర్పిస్తున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్ రూరల్: మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ప్రథమ వర్ధంతిని కుటుంబసభ్యులు ఆదివారం మండలంలోని ఎక్స్‌రోడ్డు సమీపంలో వ్యవసాయ క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్మారక స్మృతి వనంలో రాథోడ్ రమేశ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి బీజేపీ సీఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, పాల్గొని విగ్రహావిష్కరణ చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాథోడ్ రమేశ్ కుటుంబసభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గోరింటాకు వేడుకలు



గోరింటాకుతో మహిళలు

ఆదిలాబాద్: ఆషాఢ మాసం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన క్వీన్స్ కిట్టీ ఫ్రెండ్స్ మహిళా మండలి సభ్యులు ఆదివారం గోరింటాకు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చేతికి గోరింటాకు పెట్టుకొని సంబురాలు జరుపుకున్నారు. గోరింటాకు అలంకరణతో శరీరంలోని నాడులు చల్లబడతాయన్నారు. ఎన్నో ఔషధ గుణాలున్న గోరింటాకు పెట్టుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మహిళా మండలి సభ్యులు సంధ్యా, మీనా, రాధిక, రాణి, స్వాతి, రజినీ, వర్షా, లావణ్య, గోదావరి పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న స్కావెంజర్ల నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్ సింగ్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎస్. సుధాకర్, కార్యదర్శిగా ముస్కు విలాస్, కన్వీనర్‌గా నిమ్మల దేవిదాస్‌లను ఎన్నుకున్నారు. సంఘం అభివృద్ధికి పాటుపడాలని, స్కావెంజర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు సూచించారు. కార్యక్రమంలో సంఘ సభ్యురాలు సురేఖ పాల్గొన్నారు.

కళాశాలలో ప్రవేశాలు పెంచాలి



మాట్లాడుతున్న డీఐఈవో రాథోడ్ గణేష్‌కుమార్

నార్నూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు అధ్యాపకులు కృషి చేయాలని డీఐఈవో రాథోడ్ గణేష్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అడ్మిషన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. అధ్యాపకులందరూ సమిష్టిగా అడ్మిషన్లు పెంచాలన్నారు. నీటి సమస్య, మరుగుదొడ్ల సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పూర్తి చేయిస్తానని అన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ కేశవులు, అధ్యాపకులు బాలాజీ కాంబ్లే, ఉదయ్ కుమార్, సుజాత, రచన, నరేశ్, అజయ్ కుమార్, వరుణ్ రెడ్డి, జలంధర్, తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న మెస్రం దుర్గు పటేల్

నార్నూర్: ఐటీడీఏ పరిధిలోని బెస్ట్ అవలేబుల్ పాఠశాలలకు నిధులు మంజూరు చేయాలని గొండ్వాన రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు పటేల్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని కుమురంభీం భవన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజన విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలో విద్యానందించేందుకు ఐటీడీఏ ద్వారా ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు కొంత మంది విద్యార్థులను ఎంపిక చేస్తుందన్నారు. గతేడాది నుంచి నిధులు మంజూరు చేయకపోవడంతో ఈ ఏడాది నుంచి డబ్బులు కడితేనే పాఠశాలకు అనుమతి ఇస్తామని తెల్చి చెప్పడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోడసం నాగోరావు, మెస్రం రూప్‌దేవ్, కనక ప్రభాకర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

డాక్టర్లను నియమించాలని కోరాం

బోథ్: మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఆసుపత్రిని కాంగ్రెస్ నాయకులు ఆదివారం సందర్శించారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నామని, వారం రోజుల్లో పూర్తిస్థాయి డాక్టర్లను నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, ఇన్‌చార్జి మంత్రిని కలిసి శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని కోరినట్టు కాంగ్రెస్ జిల్లా అధికా ర ప్రతినిధి పసుల చంటి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు షేక్ నాజర్ అహ్మద్, మహమ్మద్ అబ్రహర్, షేక్ షాకీర్, జగన్, అమీర్ పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయండి

ఇచ్చోడ: ఇచ్చోడ మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్‌యార్డులో జూలై 1న నిర్వహించే సీపీఐ మండల మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య కోరారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మహాసభలకు జిల్లా బాధ్యులు వస్తున్నట్లు తెలిపారు. కార్మిక సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తాత్కాలికంగా స్విమ్మింగ్ పూల్ మూసివేత

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను జూలై 1 నుంచి 4 వరకు తాత్కాలికంగా మూసి వేస్తున్నట్లు నిర్వాహకుడు రాష్ట్రపాల్ జబాడే తెలిపారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో స్విమ్మింగ్ పూల్ నీరు కలుషితమైందని, ఆ నీటిని పూర్తిస్థాయిలో తొలగించి కొత్త నీరును నింపుతామని ఆయన వివరించారు.

బ్రాహ్మణులంతా ఐక్యంగా ఉండాలి

ఆదిలాబాద్: బ్రాహ్మణులు ఐక్యంగా ఉండాలని బ్రాహ్మణ సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు బలవంతరావు అన్నారు. తెలంగాణ బ్రాహ్మణ సేవ సంస్థ హైదరాబాద్, బ్రాహ్మన సమాజ్ ఆదిలాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం తిర్పెల్లి రామాలయంలో రాష్ట్రస్థాయి 22వ వధువరుల వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. సమాజ్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. బ్రాహ్మణుల ఐక్యతను చాటేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. జిల్లా అధ్యక్షుడు అన్నోజుల సంతోష్, నిర్మల్కర్ విశ్వాస్, అభిలాష్, రాజమోహన్, అమిత్ దేశ్పాండే, తదితరులు పాల్గొన్నారు.

మనసును నియంత్రణలో ఉంచుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: మనసును నియంత్రణలో ఉంచుకోవాలని అల్టిమేట్ మైండ్ పవర్ హైదరాబాద్ మోటివేషనల్ స్పీకర్ సుబ్రహ్మణ్యం భాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సాయి సత్సంగ్ భవనంలో ఆదివారం మైండ్ పవర్ డెవలప్‌మెంట్ సెమినార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ మనసును అదుపులో ఉంచుకోవాలని సూచించారు. అప్పుడే ఏకాగ్రత పెరిగి ప్రతీ విషయంపై దృష్టి సారించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు శేఖర్, ప్రకాష్, నరేందర్ పుప్పాల, మంద అశోక్, గంగయ్య, బండారి దేవన్న, సత్యనారాయణ పాల్గొన్నారు.

వాహన యజమానులపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ప్రమాదాలకు కారణమవుతున్న భారీ వాహన యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ వన్‌టౌన్ సీఐ బి.సునీల్ కుమార్ తెలిపారు. ఆదివారం సాయంత్రం పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాండ సాంగ్వి క్రాస్ రోడ్ తిరుపెల్లి ప్రాంతంలో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ఆరుగురు భారీ వాహన యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పార్కింగ్ ప్రాంతాల్లో నిలిపి ఉంచాలని పలుమార్లు సూచించినా.. నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. ప్రతీరోజు వాహన తనిఖీలు చేపడుతామన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం



కెమెరాలు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

జైనథ్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని జైనథ్ ఎస్సై గౌతమ్ పవర్ అన్నా రు. మండల కేంద్రంలో ఆదివారం బస్టాండ్ సమీపంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పోలీసులు ఏ విధంగా విధులు నిర్వహిస్తారో సీసీ కెమెరాలు కూడా అదే విధంగా విధులు నిర్వహిస్తాయన్నారు. ఆటోమేటిక్ నంబర్ ప్లేట్, వ్యక్తుల ముఖాలు సైతం గుర్తించడం జరుగుతుందన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేది గురువులే

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



బ్రహ్మానందన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేది గురువులేనని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. నేరడిగొండ మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు నాంపల్లి బ్రహ్మనంద్ ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా బోథ్‌లోని సాయిఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఉద్యోగ విరమణ మహోత్సవానికి హాజరయ్యారు. ఉపాధ్యాయుడు బ్రహ్మనంద్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా మంచి పేరు సంపాదించి, ఎంతోమంది విద్యార్థులను తీర్చి దిద్దారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

బోథ్: సీఎంఆర్ఎఫ్ చెక్కులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం మండల కేంద్రంలోని తన నివాసంలో లబ్ధిదారులకు అందజేశారు. బోథ్ మండలానికి చెందిన గాండ్ల బాలరాజు రూ. 54,000, చిట్టి అనసూయకు రూ. 11,500, కుడాల విజయకు రూ. 12,000 పొచ్చర గ్రామానికి చెందిన మెరుగు జనార్దన్ రెడ్డికి రూ. 25,000, ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన మోహితే అవినాష్‌కు రూ. 16,500ల విలువైన చెక్కులను అందజేశారు.



ఇచ్చోడ మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో ఆదివారం 2006-07 బ్యాచ్‌కు చెందిన పదోవ తరగతి విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 18 ఏళ్ల తర్వాత కలిసి చదువుకున్న విద్యార్థులు ఒక్కచోట కలుసుకున్నారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనాడు విద్యాబుద్ధులు చెప్పిన గురువులకు జ్ఞాపిక అందజేసి, సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవర్ధన్, రాజేంద్రప్రసాద్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. – ఇచ్చోడ

'దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి'



నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

ఆదిలాబాద్‌టౌన్: హైదరాబాద్‌లోని మహాన్యూస్ చానెల్ కార్యాలయంపై దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఆదిలాబాద్ జర్నలిస్టు జేఏసీ చైర్మన్ నూకల దేవేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో జేఏసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో పత్రిక, న్యూస్ చానెళ్లపై దాడులు పెరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఏర సుధాకర్, జేఏసీ కో కన్వీనర్ వెంకటేశ్, సురేశ్, మొయిస్, అనిల్, నిలేష్, అభిలాష్, దత్తాత్రి, అరుణ్, కిరణ్, దీపక్ పాల్గొన్నారు.

ఉట్నూర్ రూరల్: ఫోన్ ట్యాపింగ్‌లో భాగంగా హైదరాబాద్‌లోని మహాటీవీపై దాడులు సరికాదని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బేత రమేశ్, సీనియర్ జర్నలిస్ట్ సయ్యద్ కరీం డిమాండ్ అన్నారు. ఆదివారం ఉట్నూర్‌లో జర్నలిస్టులు నిరసన తెలిపారు. కేటీఆర్‌పై మహాన్యూస్‌లో అనుచితంగా ప్రసారాలు చేశారని బీఆర్ఎస్ నాయకులు దాడులు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. జర్నలిస్టులు రాజా గోపాల్, జావిద్, శ్రీను, ప్రశాంత్, జైపాల్, అశోక్, సంతోష్ పాల్గొన్నారు.